క్లుప్తంగా

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ఉండవెల్లి: సుంకులమ్మ జాతర సందర్భంగా మండలంలోని శేరుపల్లెలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. బుధవారం సర్పంచు నరేంద్ర నాయుడు సహకారంతో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై వివిధ రకాల ముగ్గులను వేశారు. న్యాయ నిర్ణేతలు రంగవల్లులను పరిశీలించారు. విజేతలకు సర్పంచ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

శాంతినగర్: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహ అన్నారు. బుధవారం వడ్డేపల్లి మండలంలోని తిమ్మాజిపల్లిలో బీజేపీ బూత్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

నేడు మండల స్థాయి సమావేశం

గట్టు: కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మాచర్ల ప్రకాష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు గంజిపేట శంకర్‌తో పాటుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

బస్సు సౌకర్యం కల్పించండి



ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి అలంపూర్ నియోజక వర్గానికి బస్సు సౌకర్యం కల్పించాలని బీఎస్పీ మండల నాయకులు మహేష్, ప్రభుదాసులు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం డీఎంను కలిసి పలు పలు సమస్యలను విన్నవించారు. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో నాగేంద్రం, కనకం బాబు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు రైతు ఫిర్యాదు

రాజోళి: కౌలు తీసుకుని సాగు చేసుకుంటున్న పంటను గడ్డి మందు పిచకారీ చేసి ధ్వంసం చేశారని బుధవారం రైతు విష్ణువర్ధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనువాసులు తెలిపిన వివరాల ప్రకారం వడ్డేపల్లి మండలం కొంకల గ్రామానికి చెందిన రైతు విష్ణువర్ధన్ రెడ్డి తుమ్మిళ్ల గ్రామ శివారులో ఉన్న తన బంధువుల పొలాన్ని కౌలుకు తీసుకుని రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. ఈ నెల 7వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందును పిచికారీ చేసి పంట మొత్తం ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

నోటిఫికేషన్ జారీ చేయాలి



ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేషన్ జారీ చేయాలని బీఎస్పీ నాయకుడు రాంబాబు అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని వల్లూరు గ్రామాన్ని ఆయన సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రుణాల కోసం నిరుద్యోగులు ఎండ్ల తరబడి ఎదురుచూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి కూడా మౌఖిక పరీక్షలు పూర్తై నెలలు గడుస్తున్నా నేటి వరకు నిధులను మంజూరు చేయకపోడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామ గోవిందు, నాగన్న, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- రోడ్డు పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని అధికారులు



మన్నాపురంలో ఇళ్ల మధ్య ఇలా...



ధరూరులో ఉన్నత పాఠశాల ఎదుట కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు



ధరూరులోని రైస్‌మిల్ వద్ద

ధరూరు: ప్రమాదాలు ఎన్ని జరిగినా విద్యుత్ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇష్టానుసారంగా రహదారుల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రజలు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉన్నా తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రోడ్లు, పాఠశాలలు, ముఖ్య కూడళ్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి..

మండల కేంద్రంలో గద్వాల–రాయచూరు రహదారిని ఆనుకుని ఉన్న ప్రధాన విద్యుత్ లైన్‌తో పాటు మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి ముందే ఉన్నత పాఠశాల ఉంది. స్థానిక రైస్ మిల్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు పక్కనే ఏర్పాటు చేశారు. ఉప్పేరు పునరావాస కేంద్రంలోనూ ఎక్కడ పడితే అక్కడ సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. దీంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలు చెలరేగుతున్నాయని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలంలోని ద్యాగదొడ్డిలో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో రెండేళ్ల కిందట ఓ ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఎర్తులు సరిగా లేకపోవడంతో తరచూ ఇళ్లల్లో షార్ట్ సర్క్యూట్‌తో విలువైన వస్తువులు కాలిపోతున్నాయని స్థానికులు వాపోయారు.

కంచె ఏర్పాటు చేయాలి



ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచె ఏర్పాటు చేయాలి. అధికారుల నిర్లక్ష్యంతో మూగ జీవాలు ప్రమాదాలబారిన పడుతున్నాయి. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. చిన్నపాటి గాలి వీచినా కోతలు విధిస్తున్నారు. దశాబ్దాల కిందట వేసిన పాత విద్యుత్ తీగలను మార్చి కొత్త లైన్లను ఏర్పాటు చేయాలి.

–కిష్టన్న, ధరూరు

ముగిసిన బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీల్లో పాల్గొన్న రైతులు

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో మాధవ స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు బుధవారం ముగిశాయి. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ పోటీల్లో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వృషభ రాజములు సత్తా చాటాయి. పోటీల్లో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామం బోరెడ్డి కేశవ రెడ్డికి చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో రాయచూరు లోని పాల్కందొడ్డి గ్రామానికి చెందిన ఖాజా హుస్సేన్ ఎద్దులు నిలిచాయి. నంద్యాల జిల్లా పీఆర్‌పల్లి కి చెందిన వెంకటేశ్వర్లు ఎద్దులు మూడోస్థానంలో, కర్నూల్ జిల్లా కైరవాడికి చెందిన బి.లక్ష్మన్నకు చెందిన ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు నగదు బహుతులను అందచేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనువాసులు, ఆర్‌డీఎస్ మాజీ చైర్మన్ సీతారామి రెడ్డి, రైతులు, రైతు సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అనాథలకు ఆర్థిక సాయం



అనాథ పిల్లలకు ఆర్థికసాయం అందజేస్తున్న శాలివాహన సంఘం సభ్యులు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో తల్లిదండ్రులను కోల్పోయి ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు. ఈ మేరకు బుధవారం జిల్లా శాలివాహన(కుమ్మరి) సంఘం ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.3 లక్షలను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు అందజేశారు. అదేవిధంగా ఇతరులు పోగు చేసిన రూ.లక్షను అందజేశారు. బ్యాంక్ మేనేజర్ సహకారంతో పెద్ద అమ్మాయికి రూ.2 లక్షలు, రెండో అమ్మాయికి రూ.లక్ష, చిన్న అమ్మాయికి రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా దాతలకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శాలివాహన సంఘం సభ్యులు సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సర్పంచు శేషన్ గౌడ్, వీరేష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

కంటి వెలుగుకు సర్వం సిద్ధం



మానవపాడులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీకాంత్‌రాజు



అలంపూర్‌లోని క్యాతూర్‌లో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి

అలంపూర్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం మండలలోని క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈ నెల19న ప్రారంభంకానున్న కంటివెలుగుపై ప్రత్యేక అధికారి శ్రీధర్ రెడ్డి అధికారులతో సమావేశం అయ్యారు. ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్యాతూర్‌లోని రైతువేదిక, అలంపూర్‌లోని ఒకటవ వార్డులో కంటివెలుగు కార్యక్రమం నిర్వహిస్తునట్లు మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశాద్రి సూరి, డాక్టర్ రామస్వామి, స్వరూప రాణి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో ఉదయం 9 గంటలకు కంటి వెలుగు ప్రారంభమవుతుందని ఎంపీపీ మరియమ్మ, ఎంపీడీఓ గోవిందు రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 31 వరకు నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభిస్తారని ఎంపీపీ మనోరమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గట్టు: మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లతో సీహెచ్‌ఓ ఊసేని కలిసి గ్రామంలో ఇంటింటా తిరుగుతూ కంటివెలుగు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ దగ్గర వైద్య బృందం కంటి పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీకాంత్‌రాజు కంటివెలుగు కార్యక్రమంను పరిశీలించారు. గురువారం గోకులపాడు, పెద్దఆముదలపాడు గ్రామంలో కంటివెలుగు నిర్వహిస్తునట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రిజ్వాన తాన్వీర్ పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని ఎంపీడీఓ కృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనతో తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వల్లూరు, ఇటిక్యాల గ్రామ పంచాయతీలలో గురువారం కంటి వెలుగును నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం వివిధ గ్రామాలలో ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజోళిలో తెలుగునాడు కల్లు గీతా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.గజేంద్ర గౌడ్ నివాళి అర్పించి ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్

ఖమ్మం తరలిన బీఆర్ఎస్ నాయకులు

గద్వాల రూరల్: ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభకు బుధవారం గద్వాల నుంచి ఆపార్టీ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. జెడ్పీ చైర్ పర్సన్ కె.సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, గ్రంథాలయ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్, అన్ని మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు వివిధ వాహనాలలో తరలివెళ్లారు.

సీఎం కేసీఆర్ పతనం ఖాయం



మాట్లాడుతున్న గడ్డం కృష్ణారెడ్డి

గద్వాల అర్బన్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి పతనం మొదలైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం సీనియర్ సిటిజన్ ఫోరమ్ అధ్యక్షుడు మోహన్ రావు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం కార్యాలయంలో అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిదశ ఉద్యమకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అనంతరం బీఎస్పీ గద్వాల ఇన్‌చార్జ్ సీసాల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21న మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తొలిదశ ఉద్యమకారులకు సన్మానం కార్యక్రమం ఉంటుందని, అన్ని ప్రతిపాక్ష పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి, వెంకట్ రామిరెడ్డి, కొట్టం రవి కిరణ్, పాశం దేవేందర్ రెడ్డి, వెంకట్య రామయ్య పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



చెక్కులను అందజేస్తున్న గాయత్రి, విజయభాస్కర్‌రెడ్డి

ఆత్మకూర్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన చెక్కులను బాధిత కుటుంబాలకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ అందజేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆత్మకూర్‌కు చెందిన ఇద్దరికి, పిన్నంచర్ల, మోట్లంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరికి చెక్కులను అందించారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వీరు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని సంప్రదించడంతో సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయించారని వారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌అలీ, లబ్ధిదారులు ఉన్నారు.

అనుమతి లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

శాంతినగర్: అనుమతి లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖాధికారి నరసింహ అన్నారు. బుధవారం పట్టణంలో కోచింగ్ సెంటర్లను ఎంఈఓ నరసింహ తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్లు నడుపుతున్న వారు రెండు రోజుల్లో మూసివేయాలని లేనిపక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందని పేర్కొన్నారు. అధిక ఫీజులు పాల్పడిన కోచింగ్ నిర్వాహకులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం శాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఎంఈఓ వెంట పీడీఎస్‌యూ నాయకులు హలీంపాషా, హరీష్, శివ కుమార్, శ్రీనివాసులు ఉన్నారు.

సంతకాల సేకరణ



సంతకాల సేకరిస్తున్న నాయకులు

శాంతినగర్: రాష్ట్రంలోని మూడు కోట్ల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజ్యస్థాపన కోసం డాక్టర్ విశారాదన్ మహరాజ్ చేపడుతున్న పాదయాత్రకు సంఘీభావంగా బుధవారం పట్టణంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం డీఎస్పీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ సంఘం జిల్లా ఇన్‌చార్జి నరేష్‌మహరాజ్, వడ్డేపల్లి అధ్యక్షుడు రాధాకృష్ణ, అయిజ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, ఎంఐఎం మండల అధ్యక్షుడు కలీముల్లా, వాల్మీకి సంఘం ఇన్‌చార్జ్ ఉషేన్, నాయీ బ్రాహ్మణ సంఘం మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆత్మకూర్: వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను అమ్మినా, వాడిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బీఏన్‌కే రమేష్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లో దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు వ్యాపారస్తులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని పలుమార్లు అవగాహన కల్పించి హెచ్చరించినా వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వాడుతుండడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆర్ఐ మృతి



రమేష్ (ఫైల్)

అయిజ: మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఐగా పని చేస్తున్న రమేష్(52) చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలిలా.. అయిజ మున్సిపాలిటీలో కొంతకాలంగా ఆర్ఐగా పనిచేస్తున్న రమేష్ శుక్రవారం తన స్వగ్రామం నారాయణపేటకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు పక్కన నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గుండెపోటుతో బుధవారం రాత్రి మృతిచెందాడు. రమేష్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈయన మృతి పట్ల పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఉత్తర తెలంగాణకే సీఎం కేసీఆర్ ప్రాధాన్యం



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

అలంపూర్: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఉత్తర తెలంగాణ సీఎంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం అలంపూర్ మండలంలోని క్యాతూర్ గ్రామం వద్ద ఉన్న ఆర్డీఎస్ 40వ డిస్ట్రిబ్యూటరీ వద్ద బీజేపీ జిల్లా బృందం బుధవారం కాలువలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆర్డీఎస్ వద్ద కూర్చీ వేసుకొని కూర్చొని ఆర్డీఎస్ ఆయకట్టు 87500 ఎకరాలకు సాగు నీరు అందిస్తామని ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ద్వారా 30 వేల ఎకరాలకు సాగు నీరు అందని దుస్థితి నెలకొందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఆర్డీఎస్, నెట్టంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులకు రూ. 2 వేల కోట్లు నిధులతో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, కాని రైతులకు ఉపయోగం లేని కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.30 వేల కోట్లు ఖర్చు నిధులను దుర్వినియోగం చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఆర్డీఎస్‌కు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, నాయకులు జగన్‌మోహన్ రెడ్డి, దానారెడ్డి, రఘునాథ్ రెడ్డి, భీముడు తదితరులు ఉన్నారు.



అయ్యప్ప స్వామికి అభిషేకం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి అలంకరించారు. శివ మాలధారులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



గద్వాలలోని లత్తీపురంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవీంద్ర

గద్వాల అర్బన్: మండలంలోని లత్తీపురం గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలను బుధవారం ఎంపీడీవో రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లలో మట్టితో పాటు విత్తనాలు నింపుట వంటి పనులు పూర్తయ్యాయని తెలిపారు. నాణ్యమైన మట్టిని వాడాలని, నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు నీటిని పారించాలని సూచించారు. ప్రతి ఒక్క మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నిరంజన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని కలుకుంట్ల, అమరవాయి గ్రామాలలోని నర్సరీల పనులను బుధవారం ఎంపీడీఓ రమణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలోని బ్యాగ్‌లలో విత్తనాలు వేసిన సమయంలో మొలకెత్తకపోతే ఇతర విత్తనాలను బ్యాగ్‌లలో రిప్లేస్‌మెంట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.